క్లుప్తంగా

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా 'గడపగడపకు'



దోసపాడులో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి

దెందులూరు: ప్రతి కుటుంబంలో, ప్రతి గ్రామంలోని సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. దోసపాడులో వైఎస్సార్ సీపీ దెందులూరు మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని, ఎంపీటీసీ పెద్దిశెట్టి రోహిణి, మాజీ ఎంపీటీసీ సూరిశెట్టి సుధాకర్, పార్టీ నాయకులు మారయ్య, మహేంద్ర ఆధ్వర్యంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గడిచిన నాలుగున్నరేళ్లలో జరిగిన అభివృద్ధి, సంక్షేమాన్ని వివరించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే అన్నారు. వచ్చే ఎన్నికల్లో జగనన్న ప్రభుత్వానికి మద్దతు ఇవ్వాలని కోరారు. జెడ్పీటీసీ నిట్టాలీలానవకాంతం గంగరాజు, దెందులూరు ఏఎంసీ వైస్ చైర్మన్ కాటి సుధాకర్, వలంటీర్లు, అధికారులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీఐ కార్యాలయాన్ని సందర్శించిన ట్రైనీ కలెక్టర్



భీమడోలులో సీఐ రవికుమార్‌ను వివరాలు అడిగి తెలుసుకుంటున్న ట్రైనీ కలెక్టర్ పూజ

భీమడోలు: భీమడోలు పోలీస్ సర్కిల్ కార్యాలయాన్ని శనివారం ట్రైనీ కలెక్టర్ పూజ సందర్శించారు. తన శిక్షణ కాలంలో భాగంగా ఆమె సర్కిల్ కార్యాలయాన్ని సందర్శించి సీఐ బీబీ రవికుమార్ నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యాలయ సిబ్బంది, పోలీసుల విధులు, బాధ్యతలను తెలుసుకున్నారు. సర్కిల్ కార్యాలయపు రికార్డులు, కేసుల నమోదు తదితర అంశాలను ట్రైనీ కలెక్టర్ పూజ క్షుణ్ణంగా తెలుసుకున్నారు. కేసుల పురోగతి వివరాలు, కేసుల నమోదు వాటి పరిష్కారం తదితర అంశాలపై ఆరా తీసారు. వాటిన్నింటిని ట్రైనీ కలెక్టర్‌కు సీఐ వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై చావా సురేష్‌కుమార్, పోలీసులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

దెందులూరు: గుండుగొలను వద్ద ఈ నెల 23న జరిగిన రోడ్డు ప్రమాదంలో స్థానిక న్యూ వైఎస్సార్ కాలనీకి చెందిన మీసాల రోహిత్ (26) శనివారం చికిత్సపొందుతూ మృతి చెందాడు. ఈ ప్రమాదంలో ఇప్పటికే ఇద్దరు మృతి చెందిన సంగతి విదితమే. రోహిత్ ఐటీఐ చదువుకుని ప్రస్తుతం కారు డ్రైవింగ్ నేర్చుకుంటున్నాడని దెందులూరు ఎస్‌హెచ్‌ఓ హమీద్ తెలిపారు.

2 నుంచి రజక వృత్తిదారులకు శిక్షణ తరగతులు

ఏలూరు (టూటౌన్): రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర శిక్షణ తరగతులు వచ్చే నెల 2,3,4 తేదీల్లో తాడేపల్లిగూడెంలోని అపరాల మార్కెట్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) భవనంలో నిర్వహిస్తున్నట్టు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మున్నూరు భాస్కరయ్య తెలిపారు. స్థానిక పవరుపేటలోని ప్రజా సంఘాల జిల్లా కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో దీనికి సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రజక వృత్తి దారులపై దాడులు దౌర్జన్యాలు, అత్యాచారాలు, హత్యలు చేస్తూ అక్రమ కేసులు బనాయిస్తూ తీవ్ర సామాజిక హింసకు గురి చేస్తున్నారన్నారు. రజకులకు సామాజిక రక్షణ కల్పించాలన్నారు. ఈ సమావేశంలో రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మడక రాజు, చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ పిచ్చుక ఆదిశేషు పాల్గొన్నారు.

నేడు కొవ్వలిలో అంబేడ్కర్ విగ్రహావిష్కరణ

దెందులూరు: కొవ్వలిలో ఆదివారం భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ, నూతనంగా నిర్మించిన కత్తిరి చావిడి ప్రారంభోత్సవ కార్యక్రమాలు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్టు సర్పంచ్ ఇంటేటి మధులత, దెందులూరు ఏఎంసీ వైస్ చైర్మన్ కాటి సుధాకర్ తెలిపారు.రాష్ట్ర హోం మంత్రి డాక్టర్ తానేటి వనిత, ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్ బాబు, ఎమ్మెల్సీ డాక్టర్ వందుల రవీంద్ర బాబు, పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్లా బాబూరావు ముఖ్య అతిథులుగా హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు గ్రామస్తులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

అభివృద్ధి, సంక్షేమ పథకాలతో ఆదర్శవంతమైన పాలన

- వ్యవస్థల సంస్కరణ సీఎం జగన్ తొలి ప్రాధాన్యత
- రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు
- దెందులూరులో పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం



దెందులూరు వెలమ వీధిలో రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేసిన రెవెన్యూశాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు చిత్రంలో ఎంపీ కోటగిరి శ్రీధర్



దెందులూరు 9వ వార్డులో నూతన పార్టీ స్తూపాన్ని ప్రారంభించిన మంత్రి ధర్మాన ప్రసాదరావు, చిత్రంలో ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి

దెందులూరు: ఆంధ్రప్రదేశ్‌లో గడిచిన నాలుగున్నరేళ్లలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నాయకత్వంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రూ. 2.40 లక్షల కోట్ల నిధులు అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఖర్చు చేసి ఆదర్శవంతమైన పాలన అందించామని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు తెలిపారు. శనివారం ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి అధ్యక్షతన నూతన సచివాలయం, రైతు భరోసా కేంద్రం ప్రారంభోత్సవం రూ.70 లక్షలతో నిర్మించనున్న రోడ్డుకు శంకుస్థాపన, పార్టీ జెండా స్తూపం ఆవిష్కరణ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సచివాలయం వద్ద నిర్వహించిన బహిరంగ సమావేశంలో మంత్రి ధర్మాన ప్రసాదరావు మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో లబ్ధిదారుల నుంచి ఒక్క ఫిర్యాదు లేకుండా, విమర్శలకు తావివ్వకుండా అమలు చేయడం ఎంతో గొప్ప విషయమన్నారు. ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్ మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమం, వలంటీర్ల వ్యవస్థతో పాటు అనేక రంగాల్లో రాష్ట్రం అగ్రగామిగా ఉండటానికి కారకులైన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో తాను ఎంపీగా ఉండటం సంతోషంగా, గర్వంగా ఉందన్నారు. ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, నియోజకవర్గ ప్రజల పూర్తి సహాయ సహకారాలు, ఆదరణతో గడిచిన నాలుగున్నరేళ్లలో దెందులూరు నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమానికి విద్య, వైద్య రంగాలకు పెద్ద పీట వేశామన్నారు. వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలోనూ, దెందులూరులోనూ, వైఎస్సార్ సీపీ జెండా రెపరెపలాడటం తథ్యమన్నారు. ఎమ్మెల్సీ రఘురాజు మాట్లాడుతూ తన పాదయాత్ర దెందులూరు చేరుకోవడం, తనకు మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నాయకులు ఆత్మీయ స్వాగతం పలకడం ఎన్నటికీ మరిచిపోలేనన్నారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ, ఏపీ ఆయిల్‌ఫెడ్ మాజీ చైర్మన్ కొఠారు రామచంద్రరావు, అధికారులు, ప్రజాప్రతినిధులున్నారు.

భూ అనుభవ హక్కు కల్పించండి

దెందులూరు నియోజకవర్గంలో దశాబ్దాలుగా స్థలాలు ఆక్రమించుకుని జీవిస్తున్న వారికి భూ అనుభవ హక్కు మంజూరు చేయాలని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి కోరారు. శనివారం దెందులూరులో నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే కొఠారు మాట్లాడుతూ పెదవేగి, దెందులూరు మండలం దోసపాడు, ఇతర గ్రామాల్లో ఎకరం, అరెకరం ఇలా కొంత స్థలాన్ని సేకరించి వారు నివసిస్తున్నవారికి దశాబ్దాలుగా వారికి ఎటువంటి ప్రభుత్వపరమైన ఆధారం, గుర్తింపు లేదన్నారు. ముఖ్యమంత్రి జగనన్నతో మాట్లాడి భూ అనుభవ హక్కు కల్పించాలని రెవెన్యూ శాఖ మంత్రిని కోరారు. ఏపీ ఆయిల్‌ఫెడ్ మాజీ చైర్మన్ కొఠారు రామచంద్రరావు మాట్లాడుతూ నూజివీడు నియోజకవర్గంలో మాదిరిగానే పెదవేగి, దెందులూరు మండలాల్లో దశాబ్దాలుగా స్థలాలను నమ్ముకుని జీవిస్తున్న ప్రజలకు అనుభవదారులుగా త్వరితగతిన పత్రాలు మంజూరు చేయాలని కోరారు.

శ్రీరామవరం రైతులకు పట్టాలు పంపిణీ

దెందులూరు మండలం శ్రీరామవరంలో 20 ఏళ్ల నుంచి సాగు చేసుకుంటున్న రైతులకు డాక్యుమెంట్ పట్టాల భూములుగా మార్చి నివేదికలు పంపడంతో ప్రభుత్వం ఆమోదించింది. శనివారం 15 ఎకరాల భూమిని ఐదుగురు రైతులకు మంత్రి ధర్మాన, ఎంపీ కోటగిరి శ్రీధర్, ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి, జెడ్పీ చైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ, ఏపీ ఆయిల్‌ఫెడ్ మాజీ చైర్మన్ కొఠారు రామచంద్రరావు, ఎమ్మెల్సీ రఘురాజు అందజేశారు. జెడ్పీ చైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ మాట్లాడుతూ నియోజకవర్గం ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలోనే ఆదర్శవంతమైన నియోజకవర్గంగా రూపుదిద్దుకుందన్నారు. ఈ కార్యక్రమంలో విజయవాడ కనకదుర్గమ్మ అమ్మవారి దేవస్థాన ఆలయ కమిటీ డైరెక్టర్ తొత్తడి వేదకుమారి, ఏఎంసీ చైర్మన్ అప్పన ప్రసాద్, వైస్ చైర్మన్ కాటి సుధాకర్, మండల పార్టీ అధ్యక్షుడు కామిరెడ్డి నాని, జెడ్పీటీసీ నిట్టా లీలానవకాంతం గంగరాజు, పార్టీ జిల్లా కమిటీ సభ్యులు పోకల రాంబాబు, జిల్లా కార్యదర్శులు కట్టా ఏసుబాబు, చల్లా మేరీరాజు, కొంగర రత్నకుమార్ అబ్బాస్, ఎంపీటీసీలు తోట విజయకుమారి, తాళ్ళూరి నాగరాజు, పులిపాటి ఆనంద్, సొసైటీ చైర్మన్ కొలుసు గణపతి రావు, ఏఎంసీ డైరెక్టర్ పులిపాటి శ్యామలాదేవి, పార్టీ నాయకులు సంపంగి వేణుగోపాల్ తిలక్, కట్టా వెంకట సుబ్బారావు, వన్నెకూటి సుందరం, అన్ని గ్రామాల సొసైటీ చైర్మన్లు, నియోజకవర్గంలోని సర్పంచులు, ఎంపీటీసీలు, డ్వాక్రా మహిళలు, నాయకులు, కార్యకర్తలు, వ్యవసాయ శాఖ జేడీ వై.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యాల సాధన దిశగా విద్యార్థులు కృషి చేయాలి

ఉంగుటూరు: సీనియర్ విద్యార్థులు జూనియర్లకు స్వాగతం పలకడం మంచి సంప్రదాయమని నారాయణపురం ఎస్‌ఏఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ టీకే విశ్వేశ్వరరావు అన్నారు. శనివారం నారాయణపురం అరవింద శత జయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరంలో చేరిన విద్యార్థులకు ద్వితీయ, తృతీయ సంవత్సర విద్యార్థులు ఫ్రెషర్స్ డే వేడుకలు, కళాశాల సెమినార్ హాలులో శనివారం నిర్వహించారు. సభకు అధ్యక్షత వహించిన ప్రిన్సిపాల్ మాట్లాడుతూ జీవితంలో ఉన్నతంగా ఎదగడానికి లక్ష్మాన్ని నిర్ణయించుకుని దాన్ని చేరుకునేందుకు కృషి చేయాలన్నారు. జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, కొండా రవి మాట్లాడుతూ మన శక్తి సామర్థ్యాలను దూరం చేసే చెడు అలవాట్లకు గురికాకుండా విద్యార్థులు ఉండాలన్నారు. అధ్యాపకుడు రెడ్డియ్య, బాబూరావు, నిర్మల జ్యోతి తదితరులు మాట్లాడారు. సీనియర్, జూనియర్ విద్యార్థులు వారి ప్రతిస్పందనను తెలియజేశారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

వినియోగదారుల హక్కులు, బాధ్యతలపై అవగాహన ర్యాలీ

దెందులూరు: వినియోగదారులు హక్కులు, బాధ్యతలపై అవగాహన పెంపొందించుకోవాలని న్యాయవాది కట్టా సత్యనారాయణ, దెందులూరు ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు ఈ.మల్లికార్జునరావు అన్నారు. శనివారం దెందులూరులో కొవ్వలి వినియోగదారుల సేవా మండలి ఆధ్వర్యంలో విద్యార్థులు, ఉపాధ్యాయులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బాలాజీ, రాధ, పద్మ, మల్లారెడ్డి తదితరులున్నారు.

ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠకు ఏర్పాట్లు



గోపినాథపట్నంలో నూతనంగా నిర్మించిన ఆంజనేయస్వామి ఆలయం

ఉంగుటూరు: గోపినాథపట్నంలో సోమవారం నుంచి డిసెంబరు 1వ తేదీ వరకు ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ పూజలు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. దేవదాయ ధర్మాదాయ శాఖమంత్రి, ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ ఆధ్వర్యంలో విగ్రహ పునఃప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. మంత్రి కొట్టు సత్యనారాయణ తండ్రి దివంగత కొట్టు వెంకటేశ్వరరావు, సరస్వతి దంపతులు ఈ ఆలయాన్ని ఆరు దశాబ్దాల క్రితం నిర్మించారు. ఈక్షేత్రంలో ఏటా ముక్కోటి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తారు. చేబ్రోలు–దూబచర్ల రహదారిని ఆనుకుని ఉన్న ఈ ఆలయాన్ని పునర్నిర్మించి అనేక విగ్రహాలను, గీతా మందిరాలను నూతనంగా నిర్మించారు. ఈ ఆలయం ఆధ్యాత్మిక కేంద్రంగా వర్ధిల్లాలని కొట్టు వెంకటేశ్వరరావు ఆకాంక్షను నెరవేర్చేందుకు ఆయన కుటుంబసభ్యులు ఈ ఆలయం పునర్నిర్మాణం చేపట్టారు. డా. వేదాంతం రాజగోపాల చక్రవర్తి ఆధ్వర్యంలో వేదపండితులు, అర్చకులు ఆలయం వద్ద శాంతి హోమాలు, విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. శుక్రవారం 1వ తేదీ ఉదయం 10.21 గంటలకు శుభముహూర్తాన దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, సాదిని కుమారి దంపతులతో విగ్రహ ప్రతిష్ఠ జరగనుందని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా అన్నసమారాధన నిర్వహణకు ఏర్పాట్లు చేశారు.

రహదారులపై సురక్షిత ప్రయాణం మేలు



భీమడోలులో ఆటో డ్రైవర్లకు భద్రత నియమాలపై అవగాహన కల్పిస్తున్న సీఐ బీబీ రవికుమార్

భీమడోలు: రహదారులపై సురక్షిత ప్రయాణం చేసి ప్రమాదరహిత సర్కిల్‌గా నిలిపేందుకు ఆటోవాలాలు తమ వంతు కృషి చేయాలని భీమడోలు సీఐ బీబీ రవికుమార్ అన్నారు. భీమడోలు పోలీస్‌స్టేషన్ వద్ద ఏర్పాటు చేసిన రహదారి భద్రత నియమాలు, రహదారి ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆటోవాలాలకు శనివారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎస్సై చావా సురేష్‌కుమార్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన సీఐ బీబీ రవికుమార్ మాట్లాడుతూ ఆటోలను పరిమితికి మించిన వేగంతో నడిపినా, ఓవర్‌లోడుతో నడిపినా, మద్యం సేవించి నడిపినా ప్రమాదాలు జరగడానికి ఎక్కువ అవకాశాలున్నాయన్నారు. ఆటో డ్రైవర్లు నిబంధనలను పాటిస్తూ ప్రయాణికులకు సేవలందించాలన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీవేంకటేశ్వర ఆటో వర్కర్లు, ఓనర్స్ అసోసియేషన్‌అధ్యక్షుడు సీరా సాంబశివరావు, గౌరవ అధ్యక్షుడు బాదర్వాడ కృష్ణమోహనరాజు, అధిక సంఖ్యలో ఆటో డ్రైవర్లు, ఓనర్లు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ రఘురాజుకు ఘన స్వాగతం



కొవ్వలి వంతెన వద్ద ఎమ్మెల్సీ రఘురాజుకు స్వాగతం పలుకుతున్న తొత్తడి వేదకుమారి

దెందులూరు: జగనన్న మళ్లీ ముఖ్యమంత్రి కావాలని కోరుతూ విజయనగరం ఎమ్మెల్సీ రఘురాజు చేస్తున్న పాదయాత్ర శనివారం దెందులూరుకు చేరుకుంది. ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి, ఎంపీ కోటగిరి శ్రీధర్ సూచన మేరకు విజయవాడ కనకదుర్గమ్మ ఆలయ ట్రస్టు బోర్డు డైరెక్టర్ తొత్తడి వేదకుమారి, వైఎస్సార్ సీపీ నాయకులు తొత్తడి కృష్ణ ఎమ్మెల్సీ రఘురాజుకు స్వాగతం పలికారు. విజయవాడ అమ్మవారి శేషవస్త్రాన్ని ఎమ్మెల్సీకి మెడలో వేసి పాదయాత్ర విజయవంతం కావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజయనగరం నుంచి తిరుమల తిరుపతి దేవస్థానం పాదయాత్రగా వెళ్లాలని 18 రోజుల క్రితం పాదయాత్ర ప్రారంభించారన్నారన్నారు. ఇప్పటి వరకు 360 కిలోమీటర్లు పాదయాత్ర పూర్తయిందన్నారు. ఇంకా 860 కిలోమీటర్లు పాదయాత్ర చేయాల్సి ఉందని, వైఎస్సార్ సీపీ శ్రేణులు ఘన స్వాగతం పలుకుతున్నారని ఎమ్మెల్సీ రఘురాజు అన్నారు.

ఉత్సాహంగా వన మహోత్సవం



అన్నేవారిగూడెంలో విద్యార్థులకు పోటీలను నిర్వహిస్తున్న హెచ్‌ఎం ఎస్‌కే మస్తాన్, టీచర్లు

భీమడోలు: కార్తీక మాసం పురస్కరించుకుని దుద్దేపూడి పంచాయతీ అన్నేవారిగూడెంలో ప్రీ హైస్కూల్ ప్రాంగణం వద్ద శనివారం హెచ్‌ఎం ఎస్‌కే మస్తాన్ ఆధ్వర్యంలో వన మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉల్లాసభరిత వాతావరణంలో ఉదయం నుంచి సాయంత్రం వరకూ సందడి చేసారు. తొలుత చిన్నారులు, టీచర్లు ఉసిరి చెట్టు వద్ద పూజలు చేశారు. పోటీల్లో విజేతలకు బహుమతులను అందించారు. అనంతరం సహపంక్తి వన భోజనాలు చేసారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నీలం శ్రీనివాసరావు, ఎంపీటీసీ పొల్నాటి శ్రీనివాసరావు, ఎంఈవో 1 ఈదుపల్లి శ్రీనివాసరావు, ఎంఈవో 2 ఏవీఎస్ఎస్ భాస్కర కుమార్, పీసీ చైర్మన్ ఎం.మౌనిక, టీచర్లు, పెద్దలు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో జనార్ధన స్వామి పవిత్రోత్సవాలు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక అగ్రహారంలోని జనార్ధన, శ్రీ నగరేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో భూనీళా సమేత జనార్ధనస్వామి, రంగనాయక స్వామి వార్ల పవిత్రోత్సవాలు భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. ఉత్సవాల రెండవ రోజున శనివారం ఉదయం సుప్రభాత సేవ, నిత్యార్చన (సహస్రనామార్చన), చతుస్థానార్చన, ద్వారతోరణారాధన, ధ్వజ కుంభారాధన నిర్వహించారు.సాయంత్రం నిత్యార్చన హోమాదులు నిర్వహించినట్టు ఆలయ అర్చకులు వంగల పవన్ కుమార్ తెలిపారు.

వైభవంగా సత్యనారాయణ స్వామి వ్రతం

భీమడోలు: పూళ్లలో వేంచేసియున్న కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం సత్యనారాయణ వ్రతం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శనివారం వైభవంగా నిర్వహించారు. కార్తీక మాసాన్ని పురస్కరించుకుని పూళ్ల గోదావరి కాల్వ గట్టుపై వేంచేసియున్న స్వామి వార్ల ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. కాపు సంక్షేమ సేన ఏలూరు జిల్లా యూత్ కార్యదర్శి, దాత మణికంఠ పూజా సామగ్రిని భక్తులకు అందజేసారు.

లింగ వివక్షతో అభివృద్ధికి విఘాతం

పెదవేగి : లింగ వివక్ష సమాజాభివృద్ధికి విఘాతం కలిగిస్తుందని దీనిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని పెదవేగి ఎంపీడీఓ జి రాజ్‌మనోజ్ అన్నారు. శనివారం పెదవేగి మండల పరిషత్ కార్యాలయంలో లింగ వివక్షకు వ్యతిరేకంగా జాతీయ స్థాయిలో ప్రచార కార్యక్రమంలో భాగంగా వైఎస్సార్ క్రాంతి పథం సిబ్బంది, ఐసీడీఎస్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. జెండర్ వివక్షత పై నవంబర్ 25 నుంచి డిసెంబర్ 22 వరకు స్వయం సహాయక సభ్యులకు ఎంపీడీఓ అవగాహన కల్పించారు. అనంతరం గ్రామ ప్రధాన రహదారిపై లింగ వివక్షకు వ్యతిరేకంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జి.రాజ్ మనోజ్ , ఏపీఎం.శరత్ బాబు, ఐసీడీఎస్ సూపర్ వైజర్లు శాంత రత్నం, మేరీ, పార్వతి పాల్గొన్నారు.

రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

ఏలూరు (టూటౌన్): రాజ్యాంగ దినోత్సవాన్ని ప్రతి ఒక్కరూ ఘనంగా నిర్వహించాలని ఆల్‌ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ మెండెం సంతోష్ కుమార్ కోరారు. స్థానిక నరసింహారావు పేటలోని సంఘ రాష్ట్ర కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. భారత రాజ్యాంగ ఆమోద దినోత్సవ కార్యక్రమాల్లో ప్రతి పౌరుడు పాల్గొనాలని పిలుపు నిచ్చారు. దేశంలోని ప్రతి పౌరుడికి స్వేచ్ఛ కల్పించిన భారత రాజ్యాంగాన్ని అందరూ గౌరవించాలని కోరారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. ఈ నెల 26న భారత రాజ్యాంగ ఆమోద దినోత్సవాన్ని పురస్కరించుకుని అందరికీ శుభాకాంక్షలు తెలియజేసారు.

లింగ వివక్ష రహిత సమాజస్థాపన అందరి బాధ్యత



భీమడోలులో ర్యాలీలో పాల్గొన్న మండల సమాఖ్య మహిళలు, ఎంపీడీవో పద్మావతిదేవి

భీమడోలు: లింగ వివక్ష రహిత సమాజ స్థాపన బాధ్యతగా భావించి అందరూ భాగస్వాములు కావాలని భీమడోలు ఎంపీడీవో సీహెచ్ పద్మావతిదేవి అన్నారు. జెండర్ ఆధారిత హింసకు వ్యతిరేకంగా జాతీయ ప్రచార కార్యక్రమంలో భాగంగా శనివారం అంతర్జాతీయ స్త్రీ హింసా వ్యతిరేక దినోత్సవం పురస్కరించుకుని భీమడోలు మండల మహిళా సమైక్య సంఘాల మహిళలు, అధికారులు ర్యాలీ, ప్రదర్శన, ప్రతిజ్ఞ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం మండల మహిళా సమైక్య కార్యాలయంలో జాతీయ స్థాయి జెండర్ ప్రచారంలో భాగంగా నాలుగు వారాలు నిర్వహించే కార్యాచరణ ప్రణాళికపై సమావేశాన్ని నిర్వహించారు. ఏపీఎం పి.సురేష్ కుమార్ అధ్యక్షత వహించారు. అంతర్గత ఫిర్యాదు కమిటీలు, బాల్యవివాహాలు, రక్తహీనత, ఆడపిల్లలకు విద్య అనే ప్రధాన అంశాలపై చర్చించారు. ముఖ్య అతిథులుగా ఎంపీడీవో సీహెచ్ పద్మావతిదేవి, ఐసీడీఎస్ పీవో కేవీఏఎస్ విజయలక్ష్మీ ప్రసంగించారు. లింగ వివక్ష నిర్మూలించడం ద్వారా మహిళా సాధికారత సాధ్యమవుతుందన్నారు. ఈనెల 25వ తేదీ నుంచి వచ్చే నెల 22వ తేదీ వరకు మహిళలు, బాలికలు, యువతులకు అవగాహన సదస్సులను నిర్వహిస్తామన్నారు. ఏపీవో పి.సురేష్‌కుమార్, ఏవో అన్నపూర్ణేశ్వరి, సీనియర్ అసిస్టెంట్ కుమార్, మహిళా సమాఖ్య సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



ఇందిరాకాలనీలో బ్రోచర్లు మహిళలకు అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ఉంగుటూరు: అర్హులందరికీ పథకాలు అందిస్తున్న సీఎం జగనన్నకు ప్రజలంతా అండగా నిలవాలని వైఎస్సార్ సీపీ నాయకులు కోరారు. ఆంధ్రప్రదేశ్‌కు జగన్ ఎందుకు కావాలి కార్యక్రమం ఆరో రోజు చేబ్రోలులో శనివారం నాయకులు ఉత్సాహంగా నిర్వహించారు. ఇందిరాకాలనీలో ఇంటింటికీ తిరిగి ప్రచారం చేశారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్రంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వారు ప్రజలకు వివరించారు. రానున్న ఎన్నికలలో ముఖ్యమంత్రిగా మళ్లీ జగనన్నను, వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు మాజీ సర్పంచి కరణం బుజ్జి, సొసైటీ అధ్యక్షుడు యెలిశెట్టి పాపారావు బాబ్జి, గ్రామ ఎంపీటీసీ సభ్యుడు మనసాల నాగమణి, రాయిలక్ష్మి, కో ఆప్షన్ సభ్యుడు షాజహాన్, గ్రామ వైఎస్సార్ సీపీ నాయకులు ఆకుల రాజు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

గణపవరం: చిన్నతనం నుంచే రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కల్పిస్తే రోడ్డు ప్రమాదాలు చాలావరకూ నివారించవచ్చునని గణపవరం ఎస్సై వేముల వెంకటేశ్వరరావు అన్నారు. శనివారం గణపవరం పోలీస్ ఐలెండ్ కూడలిలో స్మార్ట్ లివింగ్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రోడ్డు భద్రతపై ప్రతిజ్ఞ చేశారు. ఎస్సై వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రోడ్డు మార్జిన్, ట్రాఫిక్ నిభందనలు, జీబ్రా క్రాసింగ్, ట్రాఫిక్ సిగ్నల్స్ దగ్గర పాటించాల్సిన నియమాలను విద్యార్థులకు వివరించారు. ఈసందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు, పోలీసు సిబ్బంది ప్లకార్డులు పట్టి, నినాదాలు చేస్తూ గ్రామంలో ప్రదర్శన నిర్వహించారు.

ప్రతిష్టాత్మకంగా ఆర్టీసీ కార్గో సర్వీసు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): రాష్ట్రంలో ప్రజలకు పార్శిల్ రవాణా సేవలు అందించడానికి ఆర్టీసీ ప్రారంభించిన కార్గో సర్వీసులు ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నామని ఆర్టీసీ బోర్డు డైరెక్టర్ ఏ. రాజారెడ్డి తెలిపారు. కార్గో సర్వీసెస్ పర్యవేక్షణ నిమిత్తం శనివారం రాజారెడ్డి ఏలూరు విచ్చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థని ముందు అడుగు వేసే దిశగా యువ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా ఆర్టీసీ కార్మికులందరినీ 2020లో విలీనం చేసి చరిత్ర సృష్టించారని తెలిపారు. కార్గో సేవలు ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నామని అతి తక్కువ ధరతో రాష్ట్రంలో ఎక్కడికైనా కేవలం 24 గంటలలోపు పూర్తి భద్రతతో వినియోగదారుల సరుకును వారికి అందించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. 2025 మార్చి నాటికి రూ. 1000కోట్లు ఆదాయం లక్ష్యంగా కార్గో విస్తృత సేవలతో ముందడుగు వేస్తోందన్నారు. రాష్ట్రంలో అతి త్వరలో 1500 కొత్త బస్సులు రోడ్లమీదకి రాబోతున్నాయని తెలిపారు. ఈ సందర్భంగా ఏలూరు జిల్లా ప్రజా రవాణా అధికారి ఎన్‌వీఆర్ వరప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్రంలో కార్గో సర్వీస్ మరింత ఊపందుకుందని, అదేవిధంగా డోర్ డెలివరీ మాసోత్సవాల్లో ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాలు ముందడుగులో ఉన్నాయని స్పష్టం చేశారు.

వినియోగదారుల హక్కుల రక్షణకు ప్రత్యేక చట్టాలు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): వినియోగదారుల హక్కుల రక్షణ కోసం ఏర్పడిన చట్టాలను వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని న్యాయవాది కట్టా సత్యనారాయణ సూచించారు. కొవ్వలి వినియోగదారుల సేవామండలి ఆధ్వర్యంలో శనివారం స్థానిక కోటదిబ్బ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వినియోగదారుల హక్కులు, బాధ్యతలపై, వినియోగదారుల చట్టం–2019పై ప్రిన్సిపాల్ పీ. గిరిబాబు అధ్యక్షతన అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ముఖ్య అతిథిగా పాల్గొన్న న్యాయవాది కట్టా సత్యనారాయణ మాట్లాడుతూ దేశంలో మొదటిసారిగా 1986లో వినియోగదారుల రక్షణ చట్టం ప్రవేశపెట్టారని తెలిపారు. మళ్లీ లోపాలు సవరించి 2019 చట్టాన్ని తీసుకువచ్చారన్నారు. ఈ చట్టం ద్వారా వినియోగదారుల రక్షణ కోసం ఆరు హక్కులు కల్పించారని తెలిపారు. ప్రిన్సిపాల్ గిరిబాబు మాట్లాడుతూ వినియోగదారుల హక్కులపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. అనంతరం విద్యార్థులతో కలిసి ఏలూరు నగర వీధులలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. వైస్ ప్రిన్సిపాల్ ఎం. అజయ్ కుమార్, టీవీ దుర్గా ప్రసాద్, ఎస్.పరమేష్, విద్యార్థులు పాల్గొన్నారు.